క్లుప్తంగా...

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



మల్లాపూర్: దివ్యాంగులకు ఆసరా పింఛన్ రూ.4,016 పెంచిన సందర్భంగా గురువారం దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బూడిద గణేష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముత్యంరెడ్డి, కర్ణ, అంజి, భూపాల్‌రెడ్డి, శివ, కట్ట బుచ్చన్న, విఠల్ యాదవ్, సుగుణాకర్‌రావు, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్నహస్తం



ఆర్థికసాయం అందజేస్తున్న బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి

కుషాయిగూడ: ఆపదలో ఉన్నవారికి బీఎల్ఆర్ ట్రస్టు ఆపన్నహస్తం అందిస్తోందని ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి అన్నారు. అనారోగ్యానికి గురైన ఎన్టీఆర్‌నగర్ కాలనీకి చెందిన నవీన్‌గౌడ్‌కు, కేన్సర్‌తో మృతిచెందిన తిరుమలనగర్ కాలనీకి చెందిన నక్క ఆనంద్ కుటుంబ సభ్యులను ఆయన గురువారం పరామర్శించారు. బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు, స్థానిక నేతలు దూసరి నవీన్‌గౌడ్, పూస రమేష్, రాకేష్, రాజు, అమర్, శివ, రాజు తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తాం

బోడుప్పల్: అన్ని డివిజన్లలో దశలవారీగా మౌలిక వసతులు కల్పిస్తామని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. 15వ డివిజన్ లక్ష్మారెడ్డి కాలనీలో రూ.24.50 లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన గురువారం కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలో తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలో మిగిలిపోయిన డ్రైనేజీ పనులను త్వరలో చేపడతామన్నారు. కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. గురువారం ఆమె చర్లపల్లి డివిజన్ భాగ్యనగర్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న కరెంటు పోల్స్‌ను పరిశీలించిన ఆమె ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి పోల్స్ మార్చాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ స్వరూప, స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, కనక రాజుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పర్మనెంట్ చేయాలి

కాప్రా: విభజించు.. పాలించు సూత్రాన్ని జీహెచ్ఎంసీ అనుసరిస్తోందని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ బీ-బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి విమర్శించారు. కాప్రా సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతూ గురువారం కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం తక్షణమే పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. విభజించు పాలించు సూత్రాన్ని పాటిస్తూ సమ్మెను నీరుగార్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

రాష్ట్రంలో అణిచివేతకు గురైన సబ్బండ వర్గాలు

- ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్
- కేసీఆర్ వైఖరిపై 24 గంటల నిరసన దీక్ష
- ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించేందుకే..
- సంఘీభావం తెలిపిన పలు సంఘాల ప్రతినిధులు



నిరసన దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

కుషాయిగూడ: సీఎం కేసీఆర్ పాలనలో సబ్బండ వర్గాలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణిచివేతకు గురయ్యారని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. బీసీ కులాలు, ఎంబీసీ కులాలను మోసం చేస్తున్న కేసీఆర్ వైఖరిపై గురువారం ఆయన ఈసీఐఎల్ చౌరస్తాలో 24 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సందర్భం వచ్చినప్పుడల్లా ఓట్లు దండుకొని పబ్బం గడుపుకుంటూ సబ్బండ వర్గాలను మోసం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు కేటాయిస్తే సబ్బండ వర్గాల జీవితాల్లో మార్పు వస్తుందని సంతోషపడ్డారు. కానీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి పదేళ్లు గడిచినా వంద కోట్లు కూడా ఖర్చు చేయకుండా మోసం చేసింది వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించక ఉన్నత చదువులు చదువుతున్న పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేతి, కుల వృత్తులపై ఆధారపడి జీవించే అన్ని వర్గాల ప్రజలను సైతం బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నాయీ బ్రాహ్మణులు, రజకులకు వంద యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తూ విద్యుత్, కమర్షియల్ పన్నుల రూపంలో పరోక్షంగా జీహెచ్ఎంసీ ఇచ్చిన సబ్సిడీ కంటే ఐదురెట్లు అధికంగా వసూలు చేస్తుందన్నారు. గీత కార్మికులకు తాటి వనం కోసం 5 ఎకరాల స్థలం కేటాయిస్తామన్న హామీని అటకెక్కించారన్నారు. సబ్బండ వర్గాలను కేసీఆర్ ప్రభుత్వం మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించేందుకే ఈ నిరసన దీక్షను చేపట్టినట్లు తెలిపారు. ఇక ముందు నీ ఆటలు చెల్లవని ఖబడ్దార్ కేసీఆర్ అంటూ హెచ్చరించారు. అంతకుముందు ఈసీఐఎల్ చౌరస్తాలో అంబేడ్కర్, చాకలి ఐలమ్మ, సర్దార్ పాపన్నకు నివాళులర్పించి దీక్షలో కూర్చున్నారు. కార్పొరేటర్ చేతన ఆయనకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాదం, బ్రహ్మచారి, అంబటి వెంకటాచలం, నర్సింగరావు, లక్ష్మణ్, వెంకులు, ఏజాజ్, అశోక్, ఆనంద్‌గౌడ్, చంద్రకళ, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో బీజేపీ గెలుపు ఖాయం



విధాన సభ ప్రభాస్ యోజనలో బీజేపీ ఎమ్మెల్యే

రామంతాపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని అస్సాం లకీంపూర్ ఎమ్మెల్యే మనాబ్ డేక అన్నారు. గురువారం రామంతాపూర్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావు అధ్యయనంలో నిర్వహించిన బీజేపీ విధాన సభ ప్రభాస్ యోజన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో బీజేపీ పరిస్థితి లోటుపాట్లు సానుకూల పరిస్థితులను పరిశీలించడానికి అధిష్టానం పంపగా వచ్చానని నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు స్థానిక నేతలకు కొన్ని సూచనలను చేశానని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ సెంటిమెంట్ మీద అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయామని రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, శక్తి కేంద్రాలు, బూత్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్మికులను పర్మనెంట్ చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నేత ఎన్.బాలమల్లేష్

అల్వాల్: జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు పర్మనెంట్ చేయాలని అల్వాల్ మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం సీపీఐ నేతలు, పారిశుద్ధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ మాట్లాడుతూ అల్వాల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న దాదాపు 700 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు ప్రభుత్వం తక్షణమే పర్మనెంట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినా ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని విమర్శించారు. కేసీఆర్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చి వాటిని అమలు చేయడంలో విఫలం చెందారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మున్సిపల్ కార్మికులు కీలకపాత్ర వహించారన్నారు. అంతేగాకుండా ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో సఫాయన్నా.. సలాం అని ఎన్నోసార్లు చెప్పారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



మల్కాజిగిరి: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో గురువారం ఆనంద్‌బాగ్ కమ్యూనిటీ హాల్‌లో రక్తదాన శిబిరాన్ని పూర్వ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరాన్ని లయన్ లింగారెడ్డి, కార్పొరేటర్ శ్రవణ్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇప్పటికీ దేశంలో అత్యవసర పరిస్థితుల్లో రక్తం లభ్యం కాకపోవడంతో ప్రాణాలు కోల్పోతున్నారని, ఆరోగ్యం బాగున్న వారు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, ప్రభుగుప్తా, షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. సుమారు 288 మంది రక్తదానం చేశారు.

చేవెళ్ల సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: ఈనెల 26వ తేదీన చేవెళ్లలో నిర్వహించే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం మల్కాజిగిరిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం చేసిన మేలు ఏమీ లేదన్నారు. దళితబంధు పేరిట పార్టీ నాయకులే లబ్ధి పొందారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉందని, రాష్ట్రంలో అధికారంలోకి వస్తే వారి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగా డిక్లరేషన్ ప్రకటిస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సభకు హాజరవుతారని అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెంకటేష్‌యాదవ్, చంద్రశేఖర్, జి.డి.శ్రీనివాస్‌గౌడ్, సానాది శంకర్, గుత్తి చందు, వినోద్‌యాదవ్, సత్యనారాయణగౌడ్, ఉమేష్‌సింగ్, బి.కె.శ్రీనివాస్, ఆలీ, రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ కార్పొరేటర్ పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం మోహన్‌రెడ్డికి రూ.45,500, ఎండీ హుస్సేన్‌కు రూ.14 వేలు, బి.అనీల్‌కు రూ.10 వేల చెక్కును అందించారు.

పలు ఇళ్లకు కరెంటు కట్



మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని ఎర్రకుంట కాలనీలో నాచారం విద్యుత్ ఏఈ గురువారం నలుగురు లైన్‌మెన్లతో కలిసి హల్‌చల్ చేశారు. విద్యుత్ మెయిన్ లైన్ ఆఫ్ చేసి దాదాపు 15 ఇళ్లలో కరెంట్ కట్ చేశారు. విద్యుత్ బిల్లులు చెల్లించినా ఎందుకు కట్ చేస్తున్నారని నిలదీశారు. కాలనీవాసులు అందరూ కలిసి అడ్డుకోవడంతో విద్యుత్ ఏఈ లైన్‌మెన్లను తీసుకొని జారుకున్నారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ట్విటర్‌లో పోస్ట్ చేసినట్లు స్థానికులు తెలిపారు.

పేద విద్యార్థులకు అండగా మధురా చారిటబుల్ ట్రస్టు



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ట్రస్టు నిర్వాహకులు

ఉప్పల్: పేద విద్యార్థులకు మధురా చారిటబుల్ ట్రస్టు అండగా ఉంటుందని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో ట్రస్టు ఆధ్వర్యంలో రాగిడి రియాన్ చేతులమీదుగా విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ట్రస్టు పని చేస్తోందని అన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలకల నర్సింహారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు వంజరి సంతోష్, జైరుద్దీన్, అమీర్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జయహో చంద్రయాన్



రామంతాపూర్: చంద్రయాన్-3 విజయవంతం కావడంతో గురువారం రామంతాపూర్ గణేష్‌నగర్‌లోని కాకతీయ పాఠశాల విద్యార్థులు పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ భవానిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అంతరిక్షంపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.

కలిసికట్టుగా బీఆర్ఎస్‌ను గెలిపిద్దాం



రామంతాపూర్: స్థానిక పోచమ్మ దేవాలయం నుంచి బీఆర్ఎస్ హబ్సిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీజేపీ కార్యకర్తలు నేతలు, ర్యాలీగా వెళ్లి ఉప్పల్ నియోజకవర్గం టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్ష్మారెడ్డిని ప్రకటించడం సంతోషకరమని, కలిసికట్టుగా పనిచేసి ఉప్పల్ నియోజకవర్గంలో మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు గణేష్, స్వామి, రాజు, ఏకాంత అంజయ్య, రమేష్‌గౌడ్ డాక్టర్ రాజు, అక్బర్, రాజ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోవాలి

అల్వాల్: విద్యతో పాటు కళాశాల స్థాయిలో ఉద్యోగ అవకాశాలు మెరుగు పర్చుకోవాలని సెయింట్ అల్ఫోర్స్ కళాశాల విద్యా సంస్థల నిర్వాహకులు డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం అల్వాల్ హిల్స్‌లో జరిగిన ఫ్రెషర్స్ డేలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చదువుతో సమాజంలో జరుగుతున్న ప్రతి అంశాన్ని తెలుసుకోవాలన్నారు.



ఉప్పల్‌లో గంజాయి పట్టివేత



ఏకుల సందీప్‌రెడ్డి

ఉప్పల్: గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన గురువారం ఉప్పల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ న్యూభరత్‌నగర్‌లో నివాసముండే ఏకుల సందీప్‌రెడ్డి(23) స్నేహితులు అంబాల రాకేష్, స్వరాజ్ కృష్ణ ముగ్గురు కలిసి తరచూ వైజాగ్ వెళ్లి వస్తూ అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గంజాయి కొనుగోలు చేస్తూ నగరంలో విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు, ఉప్పల్ పోలీసులు గురువారం సంయుక్తంగా ఏకుల సందీప్‌రెడ్డి ఇంటిపై దాడి చేసి వారి వద్ద నుంచి 10 కిలోల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సందీప్‌రెడ్డితో పాటు రాకేష్, స్వరాజ్‌లను కూడా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మరో ఘటనలో.. మేడిపల్లి సాయినగర్‌లో నివసించే ప్రతీక్ నారాయణ ప్రసాద్(21), పెంబర్తి ప్రాంతానికి చెందిన ఈతబోయిన నరేష్(23) ఇద్దరు స్నేహితులు. ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి సేవించడంతో పాటు విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఉప్పల్ విటి కమాన్ వద్ద బుధవారం కాపు కాసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 90 గ్రాముల గంజాయి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఇద్దరు గతంలో మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసుల్లో పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చారు.

నాణ్యత లేని నిర్మాణంతో తూము లీకేజీ

రామంతాపూర్: చిన్న చెరువును గురువారం స్థానిక బీజేపీ నేతలు సందర్శించి తూము గేట్ ద్వారా లీకేజీ అవుతున్న తీరును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మించిన చిన్న చెరువు తూము గేటు నాసిరకంగా నిర్మించడంతో చెరువులోని నీరు లీకేజీ అవుతూ బయటకు పోతోందని అన్నారు. చెరువులో చుక్క నీరు నిల్వ ఉండకుండా ఉండే అవకాశం ఉందని, దీంతో స్థానికంగా బోర్‌వెల్ పంప్‌లో భూగర్భ జలాలు ఇంకిపోయే ప్రమాదం ఉందని అన్నారు. అధికారులు వెంటనే తూము గేట్లకు మరమ్మతులు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు వేముల వెంకట్‌రెడ్డి, నాసు సతీష్, మహేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



చెరువు తూము వద్ద లీకేజీని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

అభినందనలు



కుషాయిగూడ: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పట్నం మహేందర్‌రెడ్డిని మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

ఉప్పల్ నాయబ్ తహసీల్దార్‌గా సందీప్ కుమార్ రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ మండల నాయబ్ తహసీల్దార్‌గా సందీప్ కుమార్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేసిన రఫిక్ ఉప్పల్ ఎన్నికల విభాగం అధికారిగా బదిలీపై వెళ్లారు.

ఉప్పల్ ఎమ్మెల్యేగా పోటీకి అవకాశం కల్పించండి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి బయోడేటా అందజేస్తున్న బీజేపీ నేత మహేష్‌కుమార్

కుషాయిగూడ: ఉప్పల్ అసెంబ్లీ నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని బీజేపీ సీనియర్ నేత ఎనుముల మహేష్‌కుమార్ కోరారు. ఈ మేరకు గురువారం తన మద్దతుదారులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లి ఆయనను కలిసి తన బయోడేటాను అందజేశారు. గతంలో ఇక్కడ పోటీ చేసిన వారికి డిపాజిట్ కూడా దక్కలేదని ఆయన కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఉప్పల్‌లో బీజేపీకి విజయ అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని టికెట్ కేటాయిస్తే ఉప్పల్‌లో బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బీజేపీ నేతలు శామీర్‌పేట ధర్మారెడ్డి, రవీందర్‌రెడ్డి, పర్వేశ్‌సింగ్, కల్లూరి వెంకట్‌రెడ్డి, వై.సత్యనారాయణ, బొజ్జ పవన్, ఎనుముల రాకేష్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్

అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ తదితరులు

రామంతాపూర్: ఎన్నికల సందర్భంగా ఈవీఎంల పంపిణీతో పాటు ఎన్నికల అనంతరం భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుపై రామంతాపూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పలువురు అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచేందుకు ఉన్న సదుపాయాలను పరిశీలించినట్లు చెప్పారు. ఈవీఎంల పంపిణీ, తిరిగి సేకరణ రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల నుంచే జరుగుతుందని, స్ట్రాంగ్ రూమ్‌ను కూడా ఈ కళాశాలలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈవీఎంలు భద్రపరిచేందుకు ఉన్న సౌకర్యాల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్ సదుపాయాలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, మండల తహసీల్దార్ వెంకట నరసింహారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రఫీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధా తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా తీజ్ ఉత్సవాలు



కుషాయిగూడ: లంబాడీల సంప్రదాయ ఉత్సవం తీజ్ పండగను గురువారం చర్లపల్లి డివిజన్, మారుతీనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడీల సంప్రదాయ దుస్తులు ధరించి, నెత్తిన వరి నాట్ల గంపలతో వారు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలకు బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ అభ్యర్థి, బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై వారికి తీజ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో కలిసి గిరిజన నృత్యాలు చేసి సందడి చేశారు.